క్లుప్తంగా

శబరిమల బయలుదేరిన బూచేపల్లి



ఇరుముడులతో శబరిమల బయలుదేరుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ

చీమకుర్తి: అయ్యప్పస్వామి మాల ధరించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ దీక్ష కాలం పూర్తి కావడంతో ఆదివారం ఇరుముడులతో శబరిమల బయలుదేరి వెళ్లారు. ముందుగా చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించి ఇరుముడులతో శబరిమలకు అయ్యప్పస్వామి దర్శనం కోసం బయలుదేరి వెళ్లారు. వారి వెంట బూచేపల్లి కుటుంబ సభ్యులు, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు ఉన్నారు.

వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా శిద్దా



శిద్దా సూర్యప్రకాశరావు, క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో/నాగులుప్పలపాడు: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం మధురైలోని తమకం కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ది లెజెండ్స్ ఐకాన్ కార్యక్రమంలో 2025 సంవత్సరానికి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఒంగోలుకు చెందిన శిద్దా సూర్యప్రకాష్ రావును, అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరుకు చెందిన కొంజేటి వెంకట సురేష్‌బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆమేరకు వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ ప్రకటించారు. 2024 వీసీఐ అంతర్జాతీయ అధ్యక్షుడు ఆర్ రవి చంద్రన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు ప్రమాణ స్వీకారం చేశారు.

260 మందికి వైద్య పరీక్షలు

చీమకుర్తి రూరల్: మండలంలోని మర్రిచెట్లపాలెంలో ఆదివారం ఒంగోలుకు చెందిన ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ కార్తికేయ పాలిక్లినిక్ ప్రాంగణంలో డాక్టర్ శివకృష్ణ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 260 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈసీజీ, సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ శివకృష్ణ తెలిపారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి గ్రామ ప్రజలకు సేవలు అందించడం తమకు చాలా సంతోషంగా ఉందని ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఉమాపతి అన్నారు. వైద్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీనివాస్ సేవలందించారు.

పోలీస్‌స్టేషన్‌కు మొక్కలు అందజేత

కొత్తపట్నం: పోలీస్ స్టేషన్ చుట్టూ మొక్కలు ఉంటే ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు అన్నారు. కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఆదివారం మొక్కలు అందించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలతో వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో బొద్దికూరపాడు హైస్కూల్ హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు, కొత్తపట్నం హైస్కూల్ ఉపాధ్యాయులు శాతల బాలాజీ, మద్దిరాల శరత్‌చంద్ర బాబు, పల్లె కృష్ణమూర్తి, యలగాల సంజీవరావు, కంచర్ల మధు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు రిలీఫ్ ఫండ్ రావడం లేదు

ఒంగోలు టౌన్: ఎస్సీ, ఎస్టీలకు రిలీఫ్ ఫండ్ సక్రమంగా రావడం లేదని, ఎస్సీ ఎస్టీల కేసుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు తెలిపారు. ఆదివారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. నగరంలోని నక్కలోళ్లకు గతంలో ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చారని, ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టలేదని వివరించారు. ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర రెడ్డిల హయాంలో ఎస్టీలకు ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి ఆర్టీసీలో ఉద్యోగాలు ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ ఆనవాయితీని కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలను అందజేయాలని డిమాండ్ చేశారు. నక్కలోళ్లకు ఇచ్చిన స్థలాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు తాను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని కమిషన్ సభ్యులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ పేరం సత్యం, సైదా నాయక్, డాక్టర్ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఆశలు ఆవిరి..!

- గద్దెనెక్కాక మాటమార్చిన కూటమి సర్కార్
- ఎన్నికల హామీల్లో వలంటీర్లకు రూ.10 వేల పారితోషికం ఇస్తామన్న చంద్రబాబు
- ప్రస్తుతం వలంటీర్లను పూర్తిగా పక్కన పెట్టడంపై పెద్ద ఎత్తున విమర్శలు
- చీమకుర్తి మండలంలో 250 మంది బాధిత వలంటీర్లు
- వలంటీర్ల సేవలు అందక అవస్థపడుతున్న అన్నివర్గాల ప్రజలు

చీమకుర్తి రూరల్: రాష్ట్రంలో కూటమి సర్కార్ ఆరు నెలల పాలనపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్ సిక్స్ పథకాల అమలులో జాప్యం, ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించిన తీరును అన్నివర్గాల ప్రజలు తప్పుపడుతున్నారు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టడం, అనంతరం హామీలు విస్మరించి మాటమార్చడం తనకు కొత్తేమీ కాదని చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడమే అందుకు నిదర్శనంగా ఉందంటున్నారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు నాయుడు వలంటీర్లపై ప్రేమ ఒలకబోశారు. వలంటీర్లు అందిస్తున్న సేవలకు రూ.5 వేలు ఏమాత్రం సరిపోదని, రూ.10 వేలు చెల్లిస్తామని నమ్మబలికారు. బాబుతో పాటు కూటమి పెద్దలు కూడా వలంటీర్లకు హామీలు గుప్పించడంతో ఎంతో ఆశపడ్డారు వలంటీర్లు. ఇలాంటి కల్లబొల్లి హామీలు నమ్మి ప్రజలంతా ఓట్లేయడంతో కూటమి సర్కార్ కొలువుదీరింది. అయితే, సీఎంగా గద్దెనెక్కిన తర్వాత చంద్రబాబు నాయుడు వలంటీర్లకు ఇచ్చిన హామీ అమలు చేయకుండా మాటమార్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడిచినా వలంటీర్ల గురించి పట్టించుకున్న పాపానపోలేదు. అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వ పాలకులే వలంటీర్ వ్యవస్థే లేదు కదా అంటూ మాట్లాడటంతో చంద్రబాబుపై వలంటీర్లు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. సీఎం చంద్రబాబు తమకు రూ.10 వేలు చెల్లిస్తారని ఎదురుచూసిన వలంటీర్లకు నిరాశే మిగిలింది.

చీమకుర్తి మండలంలో 17 సచివాలయాలు, చీమకుర్తి మున్సిపాలిటీలో మరో 8 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు స్వచ్ఛందంగా 250 మంది వలంటీర్లు సేవలందించారు. ప్రస్తుతం వారంతా నిలిచిపోవడంతో ప్రభుత్వ పెద్దల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీ విస్మరించిన సీఎం చంద్రబాబు తీరుపై వలంటీర్లతో పాటు ప్రజాసంఘాలు, కులసంఘాల నాయకుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వృద్ధుడికి పింఛన్ ఇచ్చేందుకు అతని ఇంటి వద్దే ఐరిస్ తీసుకుంటున్న వలంటీర్లు (ఫైల్)

అందరి మన్ననలు పొందిన వలంటీర్లు...

ప్రజలకు నేరుగా ఇంటివద్దకే సేవలు అందజేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. ఒక్కో వలంటీర్‌కు యాభై కుటుంబాలను కేటాయించారు. ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీతో పాటు వివిధ శాఖలకు సంబంధించి సేవలన్నీ ఇంటి వద్దకే అందించారు. ప్రధానంగా ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ అందించారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందజేసిన సేవలు ఎవ్వరూ మరిచిపోలేనివి. కరోనా బాధితులకు కుటుంబ సభ్యులు దూరంగా ఉన్నప్పటికీ.. వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలందించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో వలంటీర్ల సేవలను ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం మెచ్చుకున్నారు. అలాంటి వలంటీర్ల వ్యవస్థే లేదని కూటమి సర్కార్ అనడంతో ప్రతిఒక్కరూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు అందజేసిన సేవలను గుర్తుచేసుకుంటున్నారు. టీడీపీ తీరును తప్పుపడుతున్నారు.

చంద్రబాబు మాట తప్పారు



ఎన్నికలప్పుడు వలంటీర్లను కొనసాగిస్తామని సీఎం చంద్రబాబు మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. ఎన్నికల్లో గెలవడానికి హామీలిచ్చి ఆ తర్వాత మోసం చేయడం తగదు. వలంటీర్లను నాయకులుగా తయారు చేస్తానని గత సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం వారిని సర్పంచ్లు, ఎంపీటీసీలను కూడా చేశారు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తే ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతాయి. చంద్రబాబు ఇంత అన్యాయం చేస్తారని ఊహించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వలంటీర్లకు న్యాయం చేయాలి.

– వేమా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ, చీమకుర్తి

అంకితభావంతో సేవలందించా



ప్రజలకు అంకితభావంతో సేవలు అందజేశాం. మాకు కేటాయించిన ఇళ్ల వరకు మా కుటుంబ సభ్యులుగా భావించి అన్నివిధాలుగా అండగా నిలిచాం. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించాం. చిన్నపాటి గౌరవవేతనాన్ని కూడా మాకు దక్కకుండా చేయడం ఎంత వరకు సమంజసం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు అమలు చేయాలి.

– గుణపాటి రవీంద్రారెడ్డి, మాజీ వలంటీరు, మంచికలపాడు

వ్యవస్థ లేకుంటే వేతనం ఎలా ఇస్తామన్నారు



వలంటీర్ వ్యవస్థ లేకుంటే కూటమి పెద్దలు రూ.10 వేలు ఇస్తామని ఎలా హామీ ఇచ్చారు. వలంటీర్ల సేవలు అందరి మన్ననలు పొందిన విషయం కూటమి పెద్దలకు కూడా తెలుసు. అందుకే ఆదుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అయితే, కేవలం గత ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవస్థ కాబట్టే రద్దు చేస్తున్నారు. ఇష్టం లేనప్పుడు ఎన్నికల ముందే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించి ఉండాల్సింది. ఇప్పటికైనా న్యాయం చేయాలి.

– మాగులూరి రాజు, మాజీ వలంటీర్, చీమలమర్రి

నేడు అఖండ పడిపూజ మహోత్సవం

ఒంగోలు సిటీ: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, శిద్దా సుధీర్‌కుమార్, శృతి దంపతుల ఆధ్వర్యంలో లాయర్‌పేటలోని వారి స్వగృహంలో సోమవారం రాత్రి 7 గంటలకు అయ్యప్పస్వామి, దుర్గాఅమ్మవారి అఖండ పడిపూజ మహోత్సవం, భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఆదివారం తెలిపారు. అయ్యప్ప స్వాములు, శివస్వాములు, ఆంజనేయస్వాములు, భవానీ మాతలు ఈ భజనా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఘనంగా మార్గశిర పౌర్ణమి వేడుకలు

- 400 మంది స్వాములతో భజన

కొత్తపట్నం: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో మార్గశిర పౌర్ణమి సందర్భంగా షిర్డీ సాయిబాబా మందిర అన్న ప్రసాదాలయ చైర్మన్ కూరపాటి ప్రకాశరావు ఆధ్వర్యంలో ఆదివారం భజన కార్యక్రమం నిర్వహించారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వాముల భజన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వాములు, శివస్వాములు, ఆంజనేయస్వాములు, గోవిందస్వాములు, భవానీ స్వాములు సుమారు 400 మంది పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు పాల్గొని తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులు, గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజున షిర్డీ సాయిబాబా ఆలయంలో అన్నదానం చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.



భజన కార్యక్రమంలో పాల్గొన్న మాలధారులు

‘చెట్లతో చెలిమి’ పుస్తకావిష్కరణ



‘చెట్లతో చెలిమి’ పుస్తక ఆవిష్కరణలో కవులు, రచయితలు

ఒంగోలు మెట్రో: నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కందేపి రాణీప్రసాద్ రచించిన బాలల సైన్స్ వ్యాసాల సంపుటి ‘చెట్లతో చెలిమి’ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీఏ భవన్లో ఆదివారం ఉదయం పది గంటలకు నరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారిణి పాకల ఝాన్సీరాణి చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే చెట్ల గురించి చక్కని విజ్ఞాన దాయకమైన, బాలలకు ఉపయోగపడేలా వ్యాసాలను రాసి పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ మానవ మనుగడకు, జీవవైవిధ్యానికి ప్రధాన కారణమైన చెట్ల గురించి రాణీ ప్రసాద్ రాసిన వ్యాసాలు అందరికీ ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తాయని తెలిపారు. నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణానికి చెట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రకృతి ఉత్పత్తులలో ఔషధాలుగా ఉపయోగించే అనేక రకాల చెట్లు గురించి రాణీ ప్రసాద్ వ్యాస సంపుటి రూపంలో అందుబాటులోకి తీసుకురావడం చాలా గొప్ప విషయం అని పేర్కొన్నారు. పుస్తక రచయిత్రి రాణీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ పుస్తకం తన 50వ రచనని చెప్పారు. ప్రరవే జాతీయ కమిటీ సభ్యురాలు పి.రాజ్యలక్ష్మి పుస్తకం గురించి, అందులో ఉన్న వ్యాసాల గురించి సంక్షిప్తంగా సమీక్షించారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, ఎక్స్ ఎంపీపీ నాళం నరసమ్మ రచయిత్రిని అభినందించారు. అనంతరం ఆహ్వానకవి సమ్మేళనం నిర్వహించారు. అతిథులను, కవులను ఘనంగా సత్కరించారు. సభలో పిన్ని వెంకటేశ్వర్లు, బీరం అరుణ, గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్, ప్రజానాట్యమండలి షరీఫ్, యం.సూర్యకుమారి, తన్నీరు బాలాజీ, మిడసల మల్లికార్జునరావు, పరాంకుశం కృష్ణవేణి, శ్రీరామచంద్రునిలక్ష్మి, డి.వి.యస్.రామాచార్యులు, గుంటూరు సత్యనారాయణ, నూకతోటి శరత్ బాబు, చుండూరి శ్రీనివాసరావు, ఓరుగంటి ప్రసాద్, ఎస్. లక్ష్మీ నాంచారమ్మ, బండారు సునీత, పి.భాస్కర్, కందుల మధు, నిమ్మల వెంకయ్య, మొగిలి దేవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో ఇటీవలే ప్రమాదవశాత్తు మరణించిన రచయిత్రి శాంత లక్ష్మికి నరసం తరపున నివాళులర్పించారు. సభకు బీరం అరుణ వందన సమర్పణ చేశారు.

ఏటీఎం మోడల్‌కు అలవాటుపడాలి



ఏటీఎం మోడల్ పద్ధతిలో మొక్కలు నాటిస్తున్న నరసింహులు, వెంకటేశ్వరరెడ్డి

కొత్తపట్నం: చిన్న, సన్నకారు రైతులు వారికి ఉన్న తక్కువ పొలంలో ఏటీఎం మోడల్‌కు అలవాటు పడితే ఎక్కువ దిగుబడులు, లాభాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ నరసింహులు సూచించారు. రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆదివారం ఏటీఎం మోడల్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ మడనూరు గ్రామ పొలాల్లో సామూహికంగా నిరంతరం కూరగాయలు, ఆకుకూరలు సాగు విధానాన్ని వివరించారు. 20 సెంట్ల నేలల్లో ఏటీఎం మోడల్‌లో పంటలు వేసుకుంటే నిరంతరం ఆదాయం పొందవచ్చన్నారు. దీని ద్వారా ఆర్థిక వృద్ధితో పాటు ఆహార భద్రత ఏర్పడుతుందని తెలిపారు. ప్రస్తుతం రసాయన ఎరువులు మాన్పించి పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామన్నారు. ప్రకృతి కషాయాలతో పండించిన ఆకు కూరలు, కూరగాయలు, వివిధ రకాల ధాన్యాన్ని తీసుకుంటే ఆరోగ్యంలో ఎన్నో మార్పులు చూడవచ్చన్నారు. మండలంలో నూరు శాతం ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన ఆహార ధాన్యాలను వాడుకోవాలని సూచించారు. మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పట్టపు ఇందిరా మాట్లాడుతూ కెమికల్స్ లేకుండా ప్రతి ఆదివారం ఆకుకూరలు, కూరగాయలు అమ్ముతామని, వాటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యంతో పాటు వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. పెరటిలో మొక్కలు తీసుకుని వాటి ద్వారా వచ్చే ఆకుకూరలు, కాయగూరలు తినాలని వివరించారు. కార్యక్రమంలో రెడ్డప్ప, శిరీష, వెంకటేశ్వరరెడ్డి, రెహమాన్ బాషా, మనోహర్, నందకిషోర్, అవినాష్, హమ్మద్‌షఫీ, సీతారీలు వసంత, జహీదా తదితరులు పాల్గొన్నారు .

పాఠశాల నుంచే పరిశుభ్రతపై పాఠాలు బోధించాలి

ఒంగోలు టౌన్: పాఠశాల స్థాయి నుంచే చిన్నారులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు పాఠాలు బోధించాలని విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పెసల మస్తాన్ రావు అన్నారు. నగరంలోని మినీ స్టేడియంలో ఆదివారం పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సివిక్ సెన్స్ మీద ఒక సబ్జెక్టు పెట్టి బోధించడం వలన పరిశుభ్రత, పారిశుధ్యంపై వారిలో అవగాహన కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ విశ్రాంత ఎస్ఈ అప్పలరాజు, ఏపీ కో ఆపరేటివ్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగి పున్నయ్య, సెంట్రల్ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి కోటయ్య, మినీ స్టేడియం మేనేజర్ రాజరాజేశ్వరి, సంస్థ సభ్యులు శ్రీను, వెంకటేశ్వరరెడ్డి, రాధాకృష్ణ మూర్తి, రమణయ్య, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా దత్త హోమం



లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో దత్త హోమ క్రతువులో పాల్గొన్న దంపతులు



దత్తాత్రేయ స్వామికి ఊంజల్ సేవ

ఒంగోలు మెట్రో: మార్గశిర మాసం ఆదివారం పౌర్ణమి దత్త జయంతి సందర్భంగా స్థానిక లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో, షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో దత్త జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే దత్తాత్రేయ మూలవిరాట్ కు నేలంబొట్ల సదాశివయ్య నిర్వహణలో అర్చక స్వాములు పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు. అనంతరం పది గంటలకు అర్చకులు దత్త హోమ క్రతువును దంపతుల చేత సామూహికంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దత్త మందిరంలో దత్త సహస్రనామ పారాయణ చేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు ఒంగోలు షిరిడీ సాయి కల్చరల్ మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయ సిబ్బందికి శిక్షణ

మద్దిపాడు: సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి కార్యక్రమంపై సోమవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే శిక్షణ కార్యక్రమాలకు మండలంలోని ప్రభుత్వ సిబ్బందిని రెండు బ్యాచ్‌లుగా విడదీసి ఒక్కొక్క బ్యాచ్‌కు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. మొదటి విడతగా 16, 17 తేదీల్లో గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఎనర్జీ అసిస్టెంట్లతో పాటు మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. రెండో విడతలో డిసెంబర్ 18, 19 తేదీల్లో అన్ని గ్రామ పంచాయతీలలోని డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇస్తామని వివరించారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ఒంగోలు సిటీ: ఒంగోలులోని కరుణకాలనీ మొదటి లైన్‌లో గేత్సమన్ ప్రార్థన మందిరంలో గేత్సమన్ మినిస్ట్రీ వ్యవస్థాపకుడు పాస్టర్ ఆర్.ద్యాన్‌శంకర్ ప్రేమ ధ్యాన్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పిల్లలు నృత్య ప్రదర్శన అనంతరం వాక్యం ఉపదేశించారు. కుష్ఠురోగులకు, దివ్యాంగులకు, వితంతువులకు, పేదలకు దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రాజేష్, పాస్టర్ సురేష్, డేవిడ్‌రాజు, ఏకాంబరం, హరిబాబు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

చీమకుర్తి రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని, ఆయన త్యాగాన్ని తెలుగు వారు మరువలేరని చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కూడలి అంజలి, మాలకొండయ్య, వంకాయలపాటి అహరోను, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తిలోని అమరజీవి విగ్రహానికి నివాళులు...

చీమకుర్తి: అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా చీమకుర్తిలోని ఆయన విగ్రహానికి స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ శారద, పాటిబండ్ల రాజసులోచన, దానమ్మ, పిన్నిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, తదితరులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ ఎలైట్ సభ్యులు

సంగీత కళాశాల ఏర్పాటుకు కృషి

- ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి



వార్షికోత్సవంలో పాల్గొన్న గాయనీగాయకులు

ఒంగోలు టౌన్: నగరంలో సంగీత కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన నాదయోగ సాంస్కృతిక సంస్థ 5వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళలు, కళాకారులు అంటే తనకు ఎంతో గౌరవం ఉందని చెప్పారు. వారిని తగిన రీతిలో సత్కరించుకోవడం అదృష్టమన్నారు. నాదయోగ సభ్యులు కళలతోపాటుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు నూకతోటి శరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. హైదరాబాద్, చెన్నై, వైజాగ్, ఒంగోలుకు చెందిన 30 మంది గాయనీ గాయకులు పాడిన పాటలు ఉర్రూతలూగించాయి. సంగీత ప్రియులు మైమరిచిపోయారు. ఈ సందర్భంగా నాదయోగ అధ్యక్షుడు డాక్టర్ నవీన్ సంస్థ కార్యక్రమాలను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తున్నామని తెలిపారు. అట్టడుగు కళాకారులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మండవ మురళీకృష్ణ, విద్యావేత్త గోరంట్ల రవికుమార్, డా.కమలా సుభాష్, డా.చాపల వంశీకృష్ణ, తేళ్ల అరుణ, ఆడిటర్ ప్రియా, ఎం.సుబ్బారావు, కొల్లా మధు, నాదయోగ వ్యవస్థాపకులు నాగవర్థిని గణపతి పాల్గొన్నారు.